# బాధ్యత మీదపడీ దాకానే

"దండాలు బాబయ్యా!"

"ఏమిరా?"

"బుల్లిబాబుగారు వస్తున్నారండి"

"ఎంత దూరంలో ఉన్నారూ?"

"తబేలాలో ఉన్నారండి. ఇవాళ గుఱ్ఱాన్ని మారుస్తారు బాబయ్యా"

"ఏం?"

"కొత్తగుఱ్ఱాలు వచ్చాయి కాదండీ? సొంతంగా తనిఖీచెయ్యవలసిం దని మహారాజావారు సెల విచ్చారండి బుల్లిబాబయ్యగారికి"

"బాగుంది... ఆలస్యం అవుతుం దేమో?.... మనం అక్కడికే వెడితే?"

"అక్కర్లేదు దేవరా! ఈపాటికి గుఱ్ఱం యెక్కుతారండి".

"సరే అయితే"

"..... గుఱ్ఱం అలిసిపోయింది దొరగారూ"

"నేనింకా అలిసిపోలేదురా!"

"చిత్తం చిత్తం, తమరు అలిసిపోవడం అంటూ ఉందాండి?.... ఇది కూడా ఆగకపోతే యేలినవారికి పనికి వచ్చే గుఱ్ఱం ప్రపంచకంలో లేదన్నమాట బాబయ్యా!"

"ధోరణి చూస్తే యిది కొంతవరకూ ఆగేటట్టే ఉందిరా!"

"అయితే మంచిదే కాదండీ?.... అసలు మహారాజావారు కొత్తగుఱ్ఱాల్ని తమదగ్గిరికి తీసుకువెళ్లమన్నారండి"

"అ-లా-గా?"

"మేమంతా లాభం లేదని మనవిచేసుకున్నామండి. ఏలినవారి తనిఖీకి వాటిలో ఒక్కటీ ఆగదండి"

"బుల్లిబాబు తనిఖీమాత్రం సామాన్యం అనుకున్నావా యేమిటి? ఈగుఱ్ఱాన్ని బుల్లిబాబు తప్ప మూడోవా డెవడేనా యెక్కగలిగాడా?"

"అలాగే కానండి దొరగారూ - అరిగో బుల్లిబాబుగారు వచ్చారు"

"......"

"బహుకాలదర్శనం అదేనా దారి కాపించి పట్టిస్తేనూ"

"తబేలాకే రమ్మని కబురుచేస్తే యేమీ?"

"క్షమించాలి. ఉత్సాహాన్ని అరికట్టాను"

"కారణం చెబితే మించిపోయింది లేదు. అయిన ఆలస్యం కూడతీసుకోవా లని గుర్రానికి తెలుసు"

"......."

"దూరాన ఉండి ఆలస్యం చెయ్యడానికీ, యెదటికి వచ్చాక కూడా జాప్యం చెయ్యడానికీ తేడావుంది"-

"అవునవును"

"ఏదేనా రహస్యమా?"

"కాదు కాదు. అయినా - నీకు నచ్చదు కానీ - నువ్వు రావు కానీ-"

"ఎందుకో - యెక్కడికో రమ్మంటావు. ఎన్నో కారణాలు చూపిస్తావు. అయినా నేను రానని నీకు తెలుసు. ఇంకెందుకూ శ్రమా?"

"నిజమే; కాని చెప్పకుండా - కోరకుండా ఉండలేకపోతున్నాను. కూడా నువ్వు లేకుండా యెక్కడి కెక్కడికో వెడుతూనూ ఉన్నాను, యేమిటేమిటో చేస్తూనూ ఉన్నాను; కాని మనస్సుకి ఉల్లాసం లేదు. నువ్వు దగ్గిర లేనిలోటు క్షణక్షణానికీ, అడుగడుక్కీ - ప్రతీదాన్లోనూ కనపడుతోంది"

"........"

"ఈయేదాదినుంచీ నే నెలాంటి అవస్థపడుతున్నానో నువ్వెరగవు. ఊహించేనా తెలుసుకోవు"

"........"

"నువ్వు నన్ను చేరనివ్వడం లేదు"

".........."

"నేనంటే నీకు లక్ష్యం లేదు. స్నేహం లేదు. చివరికి దయ-"

"నువ్వంతమాట అనకూడదు. నేను నీభృత్యుణ్ణి"

"ఆభావం నా కే కోశంలోనూ లేదు"

"అయితే నీవిషయంలో నాకెలాంటి భావం ఉందో నీకు తెలవదన్నమాట"

"........"

"రాజు విషయంలో మంత్రి చూపించే లక్ష్యానికీ, మంత్రియెడల రాజు కనపరిచే లక్ష్యానికీ చాలా వార ఉంది"

"......."

"రాజులకోసం మంత్రులు ప్రాణాలిచ్చేస్తారు; కాని మంత్రులకు రాజు లిచ్చేవి డబ్బూ, ప్రశంసలూనూ"

"........"

"మంత్రులకోసం రాజులు సకలమూ అర్పించిన సన్నివేశం ప్రపంచంలో యెక్కడా లేదు"

"నేనేదో యాదాలాపంగా అన్నమాటకి నువ్వు చాలా యిదయిపోతున్నావు. నా ఉద్దేశం తెలుసుకుంటే నీకీ ఉద్రేకం కలక్కపోవును. ప్రజాపాలనం విషయంలో రాజుల బాధ్యత కంటే మంత్రుల బాధ్యత యెక్కువ.... కదూ?"

"నిజమే"

"అయితే నువ్వావీధికి వెళ్ళడం బాగుందా?"

"నాస్థితిగతులు గ్రహించి మరీ మాట్టాడు. ఇది మంచా చెడ్డా-"

"అలా కాదు. ఇది లాభమా నష్టమా-"

"సెబాస్! అదీ గమనించతగ్గది. నాఉల్లాసం కాస్తా హరించిపోయాక-నామనస్సు అయోమయం అయిపోయాక యిక నేను చేసే దేమిటి?"

"అలాంటి సందర్భం యేం వచ్చిందీ యిప్పుడూ?"

"అలా అడిగావు, బాగుంది... నేనిప్పుడు రూపతృష్ణతో అస్తవ్యస్త మయిపోతున్నాను. అనుభవం తప్ప దీనికి సాధనం కనపడలేదు. కొంతమట్టుకేనా దీన్ని జయించలేకపోయాను"

"........"

"దీక్ష పడితే కొంచెమేనా - కొన్ని - రోజులేనా అణచిపెట్టి ఉంచవచ్చు; కాని ముందుముందు - ఒకానొక రసకందాయప్పట్టులో విజృంభించి ఇది అపాయకరం అయిపోతుంది"

"సర్వమూ తెలిసిన నువ్వే-"

"విను... రాజ్యం నీది. లెక్కల్లో సర్వాధికారాలతోటీపాటు సకల బాధ్యతలూ నీవి. అయితే నువ్వు హంసతూలికాతల్పంమీద పరవశుడవై ఉండేటప్పుడు కూడా నేను బుర్ర చించుకుంటూనే ఉండాలి. ఆస్థితి వచ్చాక యిక సుఖమంటే యేమిటీ? ఆనందం అంటే యేమిటీ? కనక-"

"ఇకచాలు. వెళ్ళు"

"నచ్చిందా?"

"ఇక నిన్నడ్డుపెట్టను"

"తృప్తయిందా?"

"అనవసరంగా ఆలస్యం అయిపోతోంది"

"మారుభావనలో పడిపోయావు నువ్వు. లేకపోతే నీకిది తెలవందా?.... ఇది గమనించావా? సుఖం అనుభవించడానికే పుట్టిన నువ్వీ లేతవయస్సులోనే రాజకార్యాల్లో మునిగిపోవడమూ, విషమసంధులు విడమర్చడానికే పుట్టిన నేనిలాగ భోగలాలసతలో పడి యీతలాడుతూ ఉండడమూ - ఇది గమ్మత్తుగా లేదూ?"

"ఇక నానెపం లేదు. తెలుసునా?"

"వెడుతున్నా. ఒక్క సంగతి మాత్రం విను. నువ్వు నన్నేలేవాడవు. నీచేతిలో ఒక పనిముట్టుగానే ఉండవలసినవాణ్ణి నేను. కనక యెప్పుడవసరం వస్తే అప్పుడు – ఏక్షణంలో కబురు వస్తే ఆక్షణంలో రెక్కలు కట్టుకు వాల్తాను"

"..........."

"వెంకటపతీ!"

"ఏం సెలవు బాబూ!"

"గోవిందయ్య యేడిరా?"

"మేఘాలమీద యెగిరిపోయారు దేవరా!"

"ఏమి రౌతురా!"

"ఫిరంగికి కూడా అందరు...బాబూ గోవిందయ్యగారు"

"మనస్సుకో?"

"ఒక్క అడుగు ముందే ఉంటారు ప్రభూ!"

"........"

## 2

రాయజగపతిమహారాజుకి గోవిందయ్య చాకచక్యం పూర్తిగా తెలుసు. "దేశాటనం పండితమిత్రతా చ" అనే సిద్ధాంతం కూడా అతను బాగా యెరుగును. కాని – ఏమయితే యేం? అతగాడికి గోవిందయ్యని గురించి తీరని బెంగపట్టుకుంది.

రాయజగపతికి తిమ్మజగపతి ఒక్కడే కొడుకు. రామయామాత్యుడికి కూడా గోవిందయ్య ఒక్కడే కొడుకు.

తరతరాలనుంచి ఆవంశం ప్రజాపాలనమూ, యీవంశం మంత్రాంగమూ నిర్వహిస్తున్నాయి.

తాను ముసలివా డయిపోతున్నాడు. అయితే, అందుకు విచారం లేదు మహారాజుకి. తిమ్మజగపతికి పట్టాభిషేకం చెయ్యవలసిన రోజు సమీపిస్తోంది. అత నందు కెప్పుడెప్పుడని యెదురుచూస్తున్నాడు; కాని తిమ్మజగపతి రాజయితే మరి మంత్రి?

ఇది యిలా ఉండగా:

గోవిందయ్య అస్తమానూ వేశ్యావాటికలోనే ఉండడం చూస్తూ ఉండిన్నీ రామయామాత్యుడేమీ కలగచేసుకోవడం లేదు. చివరికి చీమకుట్టినట్టు కూడా లేదతనికి. ఇదికూడా రాజుకి ఉక్కిరిబిక్కిరి కలిగిస్తోంది.

ఒకనాడు రాజూ మంత్రీ కోటలోపలే ప్రహరీగోడ దగ్గిరగా పచారు చేస్తున్నారు. అప్పటి కింక జాముపొద్దు పూర్తిగా లేదు. ఏమిటేమిటో గొడవలు

వెళ్లిపోతున్నాయి. ఉన్నట్టుండగా మహారాజుకి హఠాత్తుగా యీసంగతి తలపుకి వచ్చింది.

"అయితేనూ-గోవిందయ్య సంగతి యేమేనా చూస్తున్నావా?"

"లేదు మహారాజా!"

"..... లేదూ?"

"లేదండి"

"మతిపోయిందా యేమిటి నీకు?"

"లేదు మహాప్రభూ!"

"అయితే నాకు పోయిందన్నమాట మతి"

"అదీ లేదు జగత్ప్రభూ!"

"........"

"అంత ఆశ్చర్యానికి కారణం నాకు బోధపడడంలేదు ప్రభూ!"

".....నీకూ గోవిందయ్యకీ యేమేనా మాట పట్టింపులు-"

"నాజన్మలో అలాంటి దౌర్భాగ్యం తటస్థించదు దేవా!"

"....."

"ఏలినవారి ఉద్దేశం యేమిటో నాకు అవగాహన కావడం లేదండి"

"నీకొడుకు చెడిపోతున్నాడు - చెడిపోతున్నా డేమిటింకా మెల్లిగా, చెడిపోయాడు"

"లేదు మహారాజా, ఎంతమాత్రమూ లేదు"

"......"

"తమతో హాస్యాలా మహాప్రభూ నాకు? నాకొడుకు చెడిపోలేదు. చెడిపోవడమున్నూ లేదు. చెడిపోదుకూడానూ. తమకి ఆవిచారం అక్కరలేదు. సకలవిషయాల్లోనూ నాకొడుకుముందు నేను తీసికట్టుగా ఉన్నాను. నాకడుపున మళ్ళీ ఆయుగంధరుడు అవతరించాడు. అచాణక్యప్రజ్ఞ మళ్ళీ ప్రజలు కళ్ళారా చూస్తారు జగత్ప్రభూ!"

"ఇదెక్కడి ధోరణోయ్?"

"ఇందులో యేమీ అజ్ఞానం కాని, అసత్యం కాని లేదు దేవా!"

"నువ్వు తప్పుదారిలో ఉన్నావు సుమా"

"లేదండి"

"......"

"......"

"నీకొడుకు తరుచు యెక్కడుంటున్నాడో - అదేనా తెలుసునా నీకు?"

"చిత్తం, వేశ్యావాటికలో ఉంటున్నాడు మహారాజా"

"అది చెడిపోవడం కాదూ?"

"వేశ్యాసంపర్కం నేను సమర్థించను; కాని నాకొడుకు చెడిపోడు మహాప్రభూ!"

"నువ్వేం చెబుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఏలినవారు పరీక్ష చేయించవచ్చు"

"పరీక్షించవచ్చా?"

"తమకి అడ్డేమిటి భూలోకదేవేంద్రా!"

"అయితే ఇప్పుడే కానిద్దా మాపని.... నువ్వు కూడానే ఉండాలిసుమా"

"మహాప్రసాదం"

కనుసన్నల్లోనే మెలగుతూ ఉన్న నౌకర్ని పిలిచి, మహారాజు, "వెళ్లి గోవిందయ్యని నుంచున్న పాళంగా తీసుకురారా" అని ఆజ్ఞాపించి, మంత్రిని వెంటబెట్టుకుని హనుమంతబురుజుమీదకి వెళ్లి కూచున్నాడు.

## 3

దారిపొడుగునా రాజు ఆలోచిస్తూనే ఉన్నాడు. కూచున్న తరవాత కూడా పదినిమిషాల దాకా మాట్లాడలేదు.

"నీధైర్యం యేమిటో కాని - మొత్తానికి నువ్వు తప్పుదారిలో ఉన్నావు. వేశ్యాసహవాసంవల్ల తను హాని, మాననష్టం - ఒకటేమిటి? నీకొడుకు కూడా నాచాటున ఆపనీ, యీపనీ నిర్వహించడం అవసరమైన రోజు లివి. నాకొడుకు చూశావా కార్యనిర్వహణం యెంత శ్రద్ధగా నేర్చుకుంటున్నాడో?"

"యువరాజావారి ప్రతిభ సామాన్యం కాదు. అయితే నాకొడుకు - నిశితప్రతిభకి అభ్యాసంతో పని ఉండదు మహారాజా"

"......"

"కార్యనిర్వహణం నౌకర్లపని. చెయ్యి తిరగవలసింది వాళ్లకి. స్థితిగతులను పట్టి కార్యాలు నిర్ణయిస్తూ ఉండడమే రాజుకీ మంత్రికీ పని. ఎప్పు డేది యెలా పరిణమిస్తుందో దా న్ననుసరించి కల్పన. దానికి ఒకదారీ తెన్నూ - అభూతకల్పనకి అభ్యాసం యేమిటి జగత్ప్రభూ?"

"స్త్రీలోలుడు-"

"చిత్తం మహారాజా! నాకొడుకు ప్రస్తుతం స్త్రీలోలుడుగా ఉండడం వాస్తవమే; కాని-"

"సరిగా యీసమయంలో నౌకరు వచ్చి "గోవిందయ్యగారు వస్తాను పద మన్నారు బాబయ్యా" అని చెప్పాడు.

"నువ్వు వెళ్లాటప్పటి కేంచేస్తున్నాడురా?"

"చిత్తం దే-వ-రా...."

"చెప్పు"

"చిత్తం చిత్తం మహాప్రభూ! నలుగురు బోగం పిల్లల మధ్య కూచున్నారండి గోవిందయ్యగారు"

"ఊహూ"

"ఒకపిల్ల బాబుగారి ఒడిలో పడుకుని కిచకిచలాడుతూ కబుర్లు చెబుతోంది దేవరా"

"సరే"

"చూట్టూ ఉన్న నలుగురు పిల్లలూ తమలపాకులు చిలకలు చుట్టి అందిస్తున్నారు మహారాజా!"

"బాగుంది"

"గోవిందయ్యగారు రెండుచేతులతోటీ అందుకుంటున్నారు బాబయ్యా"

"రెండు చేతులతోటీనా?"

"చిత్తం బాబయ్యా"

"అయితే - రెండుచేతులతోటీ నోట ఉంచుకుంటున్నాడు కదూ?"

"లేదులేదు మహాప్రభూ! కుడిచేత్తో పుచ్చుకున్నదీ కుడిచేత్తోటే నోట ఉంచుకుంటున్నారు, యెడంచేత్తో పుచ్చుకున్నదీ కుడిచేత్తోటే నోట ఉంచుకుంటున్నారండి-"

"మంత్రి గభీ మని అందుకుని "నాకొడుకు చెడిపోలేదు మహాప్రభూ! చెడిపోడు మహారాజా" అన్నాడు.

"ఏమిటోయ్ నువ్వనేది?"

"ఎడమచేత్తో యేదీ నోట ఉంచుకోగూడ దన్న సంగతి పరవశుడై ఉండికూడా నాకొడుకు మరిచిపోలేదు. ఈ ఔచిత్యపరిజ్ఞానమే నాకీ ధైర్యం కలిగించింది ప్రభూ!

మహారాజు కేమీ పాలుపోలేదు. "అయినా చూస్తాం కాదూ?" అంటూ యెదటికి చూడగా దూరాన గుర్రం వస్తోంది. పచ్చని మైదానంమీద తెల్లని గుర్రమూ, తెల్లని గుర్రంమీద చీనాంబరధారీ, అతనిమీద వృద్ధభానుని గౌరకిరణాలూ - చాలా దర్శనీయంగా ఉంది ఆదృశ్యం. పైగా మనోవేగంతో వస్తున్నాడు గోవిందయ్య. గుర్రం కాళ్లు నేలమీద ఆనుతున్నాయో లేదో యేమీ తెలవడంలేదు.

వినడమే కాని మహారా జెప్పుడూ గోవిందయ్య స్వారి చూడలేదు. రామయామాత్యుడికి కూడా యిది అదృష్టపూర్వమే; కాని తతిమ్మా అన్నింటా కొడుకు చురుకుతనం కళ్లారా చూస్తూవుండడంవల్ల అతని కిది పరిచితంలాగే వుంది.

మహారాజు రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

కోటకి కూతవేటుదూరంలో ఒక కాలవ వుంది. అది చాలా వెడల్పయిందే; కాని అప్పు డందులో ప్రవాహం లేదు. దానిమీద వంతెన ఉంది; కాని దిగువకి వెళ్లి మళ్లీ యెగువకి రావాలి.

"కాలవలో పడిపోతాడు, చూస్తా రేమిరా" అని మహారాజు కంగారుపడుతూ లేచాడు; కాని మళ్లీ చూశాటప్పటికి గుర్రం కాలవదాటేసి కన్నుమూసి తెరిచేటప్పటికి సింహద్వారంలో ప్రవేశించింది.

రాజు మళ్లీ కూచునేటప్పటికి గోవిందయ్య వచ్చి తండ్రికి నమస్కరించి చేతులు కట్టుకుని రాజుయెదట నుంచున్నాడు.

## 4

రామయామాత్యుడు తనని కానట్టు మొగం వంచుకునీ, చెవులు అప్పగించీ కూచున్నాడు. గుండెలు దూసుకుపోయేటట్టు ఒక్కమాటు గంభీరంగా చూసి మహారాజు అందుకున్నాడు.

"గోవిందయ్యా"

"చిత్తం మహాప్రభూ"

"ఏమిటోయ్ విశేషాలూ?"

"ఏలినవారి సెల వయిం దని నౌకరు తొండలువిడిపించగా చేతనయినంత తొరగా దర్శనానికి వచ్చాను మహారాజా"

"చాలా అవసర మయిన పనిలో నిమగ్నుడవై ఉన్నట్టున్నావు పాపం"

"......"

"మాట్లాడవేం?"

"నిజం చెప్పడం అవినయం అనిపించుకో దని ధైర్యంతో విన్నవించుకుంటున్నాను. పనిలేని పిల్లలకి ఎందులో ప్రవేశించినా అది అత్యవసరమయిన పనే జగత్ప్రభూ"

"......"

"దాపరికం లేకుండా ప్రవర్తించడమే నా అలవాటు. నానోటనే వినా లని-"

"అయితే.... నీ అవసరం చాలా వచ్చిం దిప్పుడు"

"చేతులు కట్టుకుని సేవలు చేసుకుంటాను మహాప్రభూ"

"మేమూ మీనాయనా ఆరు నెలలు విశ్రాంతి పుచ్చుకోతలిచాము"

"ఏలినవారి చిత్తం"

"మళ్లీ రాజకార్యాల్లో ప్రవేశించేదాకా అబ్బాయి రాజూ, నువ్వు మంత్రివీనీ"

"జగత్ప్రభువుల అనుగ్రహానికి పరవశుణ్ణవుతున్నాను. మహాప్రసాదం"

"......"

"ఈదుడుకుపిల్లవాడిమీద ప్రభువులకు కలిగిన నమ్మకానికి విస్మయం కలుగుతోంది. మాతండ్రిగారికి చేదోడు కాగలిగినందుకు ఆనందమున్నూ కలుగుతోంది. ప్రభువుల మనస్సు కరిగేటట్టు ప్రవర్తించడానికి పూనుకుంటాను"

"మరి వెళ్లిపో"

"చిత్తం, చిత్తం. చిన్న మహారాజావారి దర్శనం-"

"రేపు ఉదయం మంచిది"

"చిత్తం, అప్పుడే చేసుకుంటాను మహారాజా"

గోవిందయ్య మహారాజు యెదట శిరస్సువంచి, తండ్రి కాళ్లు కళ్లకద్దుకుని, వెనక్కి వెనక్కి నడుస్తూ బురుజుదిగాడు.

❀ ❀ ❀ ❀

గుర్రం మళ్లీ మైదానంమీద ప్రత్యక్షం అయింది; కాని యిందాకటి చురుకు లేదు. బేడీలు తగిలించినట్టు కాళ్లు అతిభారంగా యెత్తుతోందది.

ఇందాకా క్షణంలో వెనకబడ్డ కాలవ యిప్పుడు అరగడియకి సమీపించింది. వెంటనే గుర్రం నిలిచిపోయింది.

గోవిందయ్య ఒక్కమాటు అటూ యిటూ చూసి, గుర్రం దిగి, కళ్లెం పట్టుకుని కాలవలో నడిపించుకువెళ్లి, ఒడ్డెక్కి మెల్లిగా - తాపీగా గుర్రంకూడా యెక్కాడు.

మహారాజు కళ్లు మెరుపులు కమ్మాయి.

"అదేం?"

"ఏమిటి మహాప్రభూ?"

"గోవిందయ్య గుర్రం దిగాడేం?"

"కాలవ అడ్డువచ్చింది మహాప్రభూ!"

"ఇందాకా దాటించుకువచ్చాడు కాదూ?"

"అప్పుడు మంత్రికొడుకు మాత్రమే కనక"

"ఇప్పుడు?"

"మహామంత్రే కాదా మహాప్రభూ?"

మహారాజు చకితు డైనాడు. మళ్లీ చూడగా గోవిందయ్య యింటికేసి బయలుదేరినాడు:

"అలా యెక్కడికీ?"

"ఇంటికి వెడుతున్నాడు మహాప్రభూ"

"భోగంవీధికి వెళ్లడూ?"

"ఇక యీజన్మలో కాదు మహారాజా"!

"......."

"......."

"అయితే - వెళ్లాటప్పుడు వంతెనమీదనుంచి కాక కాలవ దిగి వెళ్లాడేం?"

"ఇందాకా యేలినవారి కళ్లయెదుట తన పొగరుమోత్తనం చూపించాడు. ఇప్పు దందుకు క్షమాపణ చెప్పుకున్నాడు జగత్ప్రభూ!"

"ఏమన్నావూ?"

"నాకొడుకు మహామంత్రిపదవి నిర్వహించడానికి తనకి గల అర్హత చూపించుకున్నాడు మహారాజా"

"..... చూడూ"

"చిత్తం"

"గోవిందయ్య శక్తియుక్తులు కనిపెట్టలేకపోయాను సుమా"

"ఇప్పటిదాకా అవసరం లేకపోయింది జగత్ప్రభూ"

"పొరపాటే"

"తమ రలా సెలవివ్వడం ధర్మమా?"

"నీకొడుకు శక్తియుక్తులకు తగిన రాజు కాదోయి నాకొడుకు"

"తమరు అతిశయోక్తులు సెలవిస్తున్నారు. యువరాజావారి ప్రజ్ఞకూడా నివురుకప్పిన నిప్పులాగ ప్రచ్ఛన్నమై ఉంది మహారాజా!"

".... గోవిందయ్యని పట్టి నువ్వూ, నీకంటే నేనూ, నాకంటే తిమ్మజగపతీ అదృష్టవంతులమోయ్"

"ఏలినవారికి మామీద ఉన్న అనుగ్రహం యిలా అనిపిస్తోంది"

"అంతా బాగానే ఉంది; కాని పాతవిచారం పోయి కొత్తవిచారం పట్టుకుంది"

"సెలవిప్పించండి"

"నీకొడుక్కి సుఖం లేకుండా చేశాను. పాలబుగ్గలవాణ్ణి యినపచేతులతో పిసికేశాను"

"మావంశం వత్సవాయివారిని సేవించడాని కేర్పడింది. నాకొడుకుమీద కూడా యేలినవారికి అనుగ్రహం కలగడం నా అదృష్టం. మహాప్రభూ! నాజన్మ సఫలమయింది"

"మరి నాజన్మమాట యేమిటీ?"

"ఏలినవారు కారణజన్ములే కాదా మహారాజా?"

"నాకో సంకల్పం కలుగుతోందోయ్!"

"చిత్తం"

"నువ్వు మరోలాగ అనుకోవు గాని-"

"ఎప్పు డేనా ఉందా మహారాజా?"

"నిజమే.... ఈరోజు - ఈక్షణం మొదలు నీకొడుకే మహామంత్రి"

"మహాప్రసాదం స్వామి"

"మరి రాజు?"

"ఏలినవారే"

"కాదుకాదు, తిమ్మజగపతి"

"......"

"ఏం, అలా తెల్లపోతావేం?"

"తమరు సెలవిచ్చేది-"

"అక్షరాలా ఉచితంగా ఉంది. నాకు గోవిందయ్య మహామంత్రి అయితే ఉజ్జీ యెలా ఉంటుందో తెలుసునా?"

"ఏలినవారే సెలవివ్వాలి"

"ముసీలిమొగుడికి పడుచుపెళ్లాం-"

"వద్దువద్దు, మహారాజా! తమ రలా సెలవిప్పించడం నేను వినలేను"

"ఇక చర్చవద్దు. ఇది యిలా జరిగితీరవలసిందే... నాకొడుక్కీ నీకొడుక్కీ కూడా ప్రాజ్ఞత వచ్చింది. బాధ్యత కూడా చక్కగా తెలిసింది"

"......"

"మనకి దబ్బయ్యేళ్ళు నిండాక - కొడుకులు చేతి కందివచ్చాక కూడా మనం ఉట్టికట్టుకు ఊరేగడం అనేక విధాల అనుచితం"

"......"

"పైగా మనం పూర్వకాలపువాళ్లం. ఈకాలం మన పిల్లలిది"

"రఘువంశమహారాజుల అంశ అంతా తమలో కనపడుతోంది మహారాజా"

"పట్టాభిషేకప్రయత్నాలు తొరగా సాగించు"

(ఈ కథలో వస్తువు తరతరాలనుంచి పెద్దల వాడుకలో ఉంది. రచనమట్టుకే నాది. శ్రీ. సు. శాస్త్రి)

*(ప్రబుద్ధాంధ్ర - ఫిబ్రవరి, 1935)*